# మహాభారతంలో శకుంతల పాత్ర చిత్రణ

-డా.ఎం.మంజుశ్రీ

భారతీయ సాహిత్యంలో "శకుంతల" పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంది. సంస్కృత మహాభారతంతో పాటు, కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకంలో శకుంతలను పాత్ర సృజించిన తర్వాత ఆ పాత్రకు సాహిత్యంలో శాశ్వతమైన స్థానం లభించింది. స్త్రీ మనస్తత్వాన్ని చిత్రించడంలో కవులెంతో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అందువల్ల ఇంచుమించు అన్ని భారతీయ భాషల్లోకి శకుంతల పాత్ర ప్రవేశించింది. తెలుగులో కూడా మహాభారతంలో నన్నయ శకుంతల పాత్రను తీర్చిదిద్దడంలో ఎంతో జాగ్రత్తను తీసుకున్నారు. దీనితో పాటు సంస్కృతంలో కాళిదాసు రాసిన నాటకాన్ని కూడా తెలుగులోకి రాయప్రోలు సుబ్బారావు, కందుకూరి వీరేశలింగం తదితరులు ఎంతోమంది అనువాదం చేశారు. అవిధంగా తెలుగులో కూడా శకుంతల పాత్ర ఎంతో ప్రాచుర్యం చెందింది. అందువల్ల శకుంతల పాత్ర గురించి అనేకమంది ఇదివరకే అనేక వ్యాసాలు రాసుంటారు. వాటిని ఈ కోవిడ్ -19 క్లిష్ట సమయంలో పరిశీలించడం కష్టం. కానీ, నేను నాదైన దృష్టితో మాత్రం ఈ పత్రంలో 'ఆంధ్రమహాభారతం'లో నన్నయ శకుంతల పాత్ర ద్వారా స్త్రీ మనస్తత్వ చిత్రణను విశ్లేషించాలనుకుంటున్నాను.

కవి (నన్నయ)పరిచయం:

ఆంధ్రమహాభారతం, ఆది పర్వం, చతుర్థాశ్వాసంలో శకుంతల కథ ఉంది. దీన్నే 'శకుంతలోపాఖ్యానం' అని కూడా అంటారు. అంత ప్రాధాన్యం పొందిన పాత్ర. దీన్ని వర్ణించిన కవి 11వ శతాబ్దానికి చెందిన నన్నయ విపుల శబ్దశాసనుడు. సంహితాభ్యాసనశీలుడు. సదాచార సంపన్నుడు. నిత్యసత్యవచనుడు, వేదధర్మాన్ని




అనుసరించేవాడు. బుద్ధిలో బృహస్పతి వంటివాడు, సుజనుడు అని తన గురించి తానే వర్ణించుకున్నాడు. (ఆది: 9 వ పద్యం) కాబట్టి సంప్రదాయానికి అత్యంత విలువనిస్తాడు. అదే శకుంతల పాత్ర చిత్రణలోనూ పాటించాడు. భరతవంశాంకురం శకుంతలతోనే సాధ్యమైంది. అందువల్ల ఈ పాత్రకు మహాభారతంలో అత్యంత ప్రాధాన్యం ఉంది.

## శకుంతల దుష్యంతుల కథాసారం:

వేటకు వెళ్ళిన దుష్యంతుడు, తన రాజ్యంలో, ఒక ముని ఆశ్రమంలో కణ్వమహర్షి ఉన్నాడని తెలిసి, ఆయన్ని దర్శించడానికి వెళ్ళి, అక్కడ శకుంతలను చూసి, ఆమె బ్రాహ్మణ కన్య కాదని గ్రహించి, ఆమెను గాంధర్వ వివాహం చేసుకుంటాడు. పుట్టబోయే బిడ్డకు రాజ్యాభిషేకం చేస్తానని మాట ఇచ్చి, తన రాజ్యం వెళ్ళిపోయిన దుష్యంతుడు ఆ మాట మర్చిపోతాడు. పిల్లవాడు భరతుడు పెరిగి పెద్దవాడవుతున్నా, తనను, తన కుమారుడిని రాజ్యంలోని అంతఃపురంలోకి దుష్యంతుడు తీసుకువెళ్ళకపోవడంతో, కణ్వుడు శిష్య సమేతంగా శకుంతలను హస్తినాపురానికి పంపిస్తాడు. కానీ, దుష్యంతుడు ఆమె ఎవరో తెలియనట్టు ప్రవర్తిస్తాడు. అప్పుడు శకుంతల రాజధర్మం, నీతి, దాంపత్యం మొదలైన అంశాల్ని వివరించి, ఆకాశవాణి